క్లుప్తంగా

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ



తెనుగుపూడిలో టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న రమణ, శ్రీను

దేవరాపల్లి: తెనుగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల ఉపాధ్యక్షుడు రంది వెంకటరావు పరీక్ష సామగ్రిని అందించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఆర్.నాగేశ్వరరావు సమక్షంలో ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు కొరుప్రోలు శ్రీను చేతుల మీదుగా సోమవారం వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడి, భయం వీడి ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఐక్యవేదిక కార్యదర్శి గంగవంశం సంతోష్, అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు ఎగ్జిక్యూటివ్ ఫైల్స్ పంపిణీ



విద్యార్థులకు ఫైల్స్ అందజేసిన ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు

నర్సీపట్నం : పెదబొడ్డేపల్లి బాలుర గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం వారు ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న 80 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు భద్రపరుచుకునేందుకు ఒక్కొక్కటి రూ.200 విలువ చేసే ఎగ్జిక్యూటివ్ ఫైల్స్‌ను ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులంతా పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.మంజు, పూర్వ విద్యార్థుల సంఘ ప్రెసిడెంట్ విద్యాసాగర్, కార్యదర్శి సన్యాసిరావు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ స్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు గ్రామంలో గల శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వారి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. ఉదయం స్వామి వారికి భక్తి శ్రద్ధలతో పూజలు, అభిషేకాలు,నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద దాతలు సహకారంతో అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రికి లక్ష్మీనారాయణస్వామి వారి కల్యాణం జరిగింది. ఈ ఉత్సవాలు ఈ నెల 15 వరకు జరుగుతాయని కమిటీ వారు తెలిపారు.

అర్జీలను పరిష్కరిస్తాం..

నర్సీపట్నం : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అన్ని అర్జీలను పరిష్కరిస్తామని తహసీల్దార్ రామారావు అర్జీదారులకు హామీ ఇచ్చారు. ఆర్డీవో వి.వి.రమణ విధి నిర్వహణ నిమిత్తం కలెక్టర్ ఆఫీస్‌కు వెళ్లడంతో నర్సీపట్నం తహసీల్దార్ పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. భూ సమస్యలు, ఇళ్ల స్థలాలు, డ్రైనేజీ సమస్యలతో పాటు రకరకాల సమస్యలపై 25 ఫిర్యాదులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం

కె.కోటపాడు : దాలివలసలో అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరి అభయాంజనేయస్వామిని దర్శించుకుని, పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరిపారు. రాత్రికి గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

జీడిపంటకు మద్దతు ధర కల్పించాలి



ప్రజాచైతన్య యాత్రల కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకుడు చిరంజీవి

రొలుగుంట : జీడిపంటకు రాష్ట్ర ప్రభుత్వం మంచి మద్దతు ధరను కల్పించి రైతుల వద్ద గల పంటను కొనుగోలు చేయాలని సీపీఎం నాయకుడు ఈరెల్లి చిరంజీవి అన్నారు. మండలంలో ఆ పార్టీ చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలను పెదపేట, ఎం.పేట గ్రామాల్లో సోమవారం ఆయన నిర్వహించారు. ఎం.పేటలో రైతుల సాగులో ఉన్న జీడితోటలను పరిశీలించారు. పెదపేటలో డ్రైయినేజీల నిర్మాణాలు లేక మురుగునీటి మధ్యనే జనం నివసిస్తున్నారని చిరంజీవి అన్నారు. పెదపేటలో డ్రైయినేజీలను నిర్మించాలని డిమాండ్ చేశారు.

ఇరుకు రోడ్లలో భయం..భయం!



కుసర్లపూడి నుంచి కొండల అగ్రహారం వెళ్లే రహదారిలో అమ్మన్న చెరువు దాటిన తర్వాత ప్రమాదకరంగా మలుపు



రోలుగుంట : మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రహదారిలో ప్రమాదకరమైన మలుపులతో పాదచార్లు, ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 24 పంచాయతీలు, శివారు గ్రామాలు కలిపి 30కు పైగా ఉన్నాయి. రోలుగుంట, భోగాపురం, వెలంకాయల పాలెం, నిండుగొండ కూడలి, కుంచుగుమ్మల కూడలి ఆర్అండ్‌బీ రహదారిని అనుకుని ఉండగా, మిగిలిన దారులకు పక్క దారుల గుండా మలుపులు తిరిగి వెళ్లాల్సి వస్తుంది. ఇరుకురోడ్లు, ఆపై మెలికల మలుపులతో ఎదురెదురు వాహనాలు తప్పుకునే వీలు లేక ప్రమాదాలు ఎదురవుతున్నాయి. సుబ్బారాయుడుపాలెం, నిండుగొండ, ఎస్.కొత్తూరు, శరభవరం, వడ్డిప, బుచ్చెంపేట, నెలిమట్ల, తదితర గ్రామాలకు పోవు రహదారిలో ఇరుకు రోడ్లలో మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా గ్రామాలకు ప్రయాణ సదుపాయలు లేక ప్రధానంగా ఆటోలు మీద అధికంగా రాకపోకలు సాగిస్తుంటారు. క్వారీ లారీలు కూడా ఈ రహదారుల గుండా నడుస్తున్నాయి. సర్పవరం, బుచ్చింపేట, శరభవరం, రోలుగుంట, కొంతలం, బోగాపురం, రహదారిలో క్వారీ లారీల రాకపోకలు పెరిగి ఇరుకు రోడ్లలో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆయా రహదారుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. రోలుగుంట నుంచి కొమరవోలు వెళ్లే రహదారిలో రెండే క్రితం వీఆర్ఓ తమరాన వారి పాకలు దగ్గర మలుపులో బోల్తా పడిన సంఘటనలో మృతి చెందిన సంఘటన విదితమే. ఈ దృష్ట్యా మండలంలో ప్రధాన రహదారుల్లో మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



గోల్లు నూకాలమ్మ పాక దగ్గర కుసర్లపూడి నుంచి నర్సీపట్నం వెళ్లే రహదారిలో ప్రమాదకరమైన మలుపు

హెచ్చరిక బోర్డులు పెట్టాలి



ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో రహదారులన్నీ శిథిలావస్థకు చేరాయి. ఈ రహదారిలో ఉన్న ప్రమాదకరమైన మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు అధికారులు ఏర్పాటు చేయాలి. జిల్లా అధికారులు స్పందించాలి.

-కత్రి వీరునాయుడు, కొండపాలెం మాజీ పీఏసీఎస్ డైరెక్టర్, కొండపాలెం

డ్రైవర్లకు అవగాహన కల్పించాలి

అసలే చిన్న చిన్న రహదార్లు దీనికి తోడు క్వారీ లారీలు వల్ల నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లారీ డ్రైవర్లకు అవగాహన కల్పించాలి. ఇరుకు రోడ్లలో మలుపుల వద్ద వేగంగా వాహనాలు నడపడం వల్ల పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు.

-ఉలబాల చినబాబు, బుచ్చెంపేట

యువతకు అండగా వైఎస్సార్‌సీపీ

మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



పార్టీ నాయకులతో కలిసి యువత పోరు కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం : విద్యార్థులు, యువతను మోసగించిన కూటమి ప్రభుత్వం వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగట్టి, యువతకు వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12న చేపట్టే యువత పోరు కార్యక్రమం పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. పేద విద్యార్థులకు అండగా నిలవాలనే సంకల్పంతో దివంగత సీఎం డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఈ పథకాన్ని మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి యథావిధంగా కొనసాగించి విద్యార్థులకు అండగా నిలిచారన్నారు. దీనికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడించిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు పది నెలలు కావస్తున్నా జాబ్ క్యాలెండర్, నిరుద్యోగభృతి హామీలను సీఎం చంద్రబాబు విస్మరించారన్నారు. కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను పెండింగ్‌లో ఉంచి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు ప్రతి నెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించి ఇపుడు దగా చేసిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలనే డిమాండ్‌తో అనకాపల్లిలో నిర్వహించే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, జి.సోమన్నదొర, ఎం.అప్పలనాయుడు, ఎం.నాగేంద్ర, ఆర్.రాధాకృష్ణ, ఆర్.వంశీ, యూత్ అధ్యక్షులు తమరాన శ్రీనివాసరావు, ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, మణికుమారి, జెడ్పీటీసీలు సుర్ల గిరిబాబు, అప్పలనర్స, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు లోచల సుజాత, పెట్ల భద్రాచలం, రుత్తల సర్వేశ్వరరావు, కణితి అన్నపూర్ణ, లోకవరపు శారద, లగుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పిల్లల భద్రత కోసమే పోక్సో చట్టం

-సీనియర్ సివిల్ జడ్జి షీయాజ్ ఖాన్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షీయాజ్ ఖాన్

నర్సీపట్నం : పిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టేందుకు పోక్సో చట్టాన్ని తీసుకురావడం జరిగిందని సీనియర్ సివిల్ జడ్జి పి.షీయాజ్ ఖాన్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయశాఖ ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ చిన్న పిల్లలపై లైంగిక దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలకు భద్రత కల్పించేందుకు 2012లో ఈ చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఇందులో శిక్షలు కఠినంగా అమలు అవుతాయన్నారు. విద్యార్థులకు సాధారణ విద్యతో పాటు లైంగిక విద్యపై అవగాహన కల్పించాలన్నారు. లైంగిక అంశాలపై సరైన సమాచారం పిల్లలకు అందజేయడం ద్వారా నేరాలను అరికట్టవచ్చన్నారు. ఇందులో భాగంగా పోక్సో చట్టంపై అవగాహన కల్పించే వీడియోను కూడా డిజిటల్ స్క్రీన్‌పై ప్రదర్శించారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిత్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, మండల విద్యాశాఖాధికారులు సిహెచ్.తలుపులు, నాగేంద్ర, సీఐ గోవిందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి వాసవీక్లబ్ వితరణ



గాదిరాయిలో ఆర్థిక సాయం చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

మాడుగుల రూరల్ : మండలంలో కింతలి గాదిరాయి గ్రామానికి చెందిన వాసవీక్లబ్ సభ్యురాలు లక్ష్మి (44) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందారు. స్పందించిన వాసవీ ఇంటర్‌నేషనల్ క్లబ్ వారు అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీను సూచనల మేరకు, జిల్లా గవర్నర్ కె.పూర్ణిమ ద్వారా సోమవారం సాయంత్రం మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. వాసవీ క్లబ్ సభ్యులు మరణిస్తే, వారి కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ.25వేలు అందించేలా మహాప్రస్థానం చైర్మన్ సెంతాలి కుమార్ సహకారంతో వాసవీ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణారావు ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద ఇప్పటికే చీడికాడ, కోటం, మండలాల్లో ఈ పథకం కింద ఆర్థిక సాయం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, రీజనల్ చైర్మన్ నానాజీ, జోన్ చైర్మన్ మాధవి, క్లబ్ జిల్లా సభ్యులు హరినాథ్‌బాబా, కన్నయ్యశెట్టి, మోహన్‌రావు, సర్పంచ్ జగన్నాథరావు పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు

మాడుగుల రూరల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని వైద్యులు, వైద్య సిబ్బంది తెలిపే ఆరోగ్య సూత్రాలు పాటించాలని, కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రసాదుపాత్రుడు పేర్కొన్నారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్ కార్యక్రమంలో భాగంగా 25 మంది గర్భిణులను సోమవారం పీహెచ్‌సీలో తనిఖీ చేసి, మందులు అందజేశారు. ప్రతి నెలా 9వ తేదీన ఈ కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా, 9వ తేదీ ఆదివారం కావడంతో ఈ కార్యక్రమాన్ని ఈ నెల 10, 11, తేదీల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి సుజాత, పిహెచ్ఎన్ ఇందిర, మహిళా ఆరోగ్య పర్యవేక్షకురాలు పుష్పకాంతం, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండ శిఖర గ్రామాలకు ఉపాధి పనులు ఇవ్వండి



వినూత్నంగా నిరసన తెలుపుతున్న గిరిజనులు

రావికమతం : కొండ శిఖర గ్రామాల్లో నివాసం ఉంటున్న తమకు స్థానికంగా ఉపాధి పనులు ఇవ్వాలని గిరిజనులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. మండలంలో చీమలపాడు పంచాయతీ కొండ శిఖర గ్రామాలైన నేరేడుబంద, జిలుగులోవ, సోంపురం బంధం గ్రామాల్లో 160 మంది గిరిజనులు నివాసం ఉంటున్నారు. వీరు కొండ పోడు, సామాలు, పసుపు, జీడి, అల్లం పంటల సాగుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సరైన ఉపాధి లేక బయటకు వలసలు వెళ్లుతున్నామని, ఇక్కడే ఉపాధి పనులు కల్పించాలని జనవరి 22వ తేదీన అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అర్జీ అందించామని, తక్షణమే ఉపాధి కల్పించాలని ఆదేశాలు జారీ అయినా ఇప్పటికీ పనులు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉపాధి పనులు తక్షణమే కేటాయించాలని, లేని పక్షంలో ఈ నెల 25వ తేదీన తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు హెచ్చరించారు.

చురుగ్గా 'నిమ్మకట్టు' కాలువ పనులు



కాలువలో సిమెంటు పనులు చేస్తున్న కూలీలు

నాతవరం : నిమ్మకట్టు ఆనకట్టు అయకట్టు కాలువల అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మండలంలో రాజుపేట అగ్రహారం గ్రామ శివారు తాండవ నదిపై బ్రిటిష్ హయాంలో నిర్మించిన నిమ్మకట్టు అనకట్టు నుంచి ఆయకట్టుకు నీరందించే కాలువలు పూర్తిగా పూడికతో నిండిపోయాయి. ఈ కాలువల అభివృద్ధికి ఇటీవల ప్రభుత్వం రూ.11 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ, జేఈ శ్యామ్‌కుమార్ మన్యపురట్ల సెక్షన్ పరిధిలో తాండవ ప్రాజెక్టు నీటి సంఘం అధ్యక్షుడు అప్పన దివాణం ఇటీవల కాలువ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ప్రస్తుతం ప్రధాన గేట్ల సమీపంలో కాలువలో సిమెంటు లైనింగ్ పనులు చేస్తున్నారు. కాలువలో నీరు వృథా కాకుండా సిమెంట్ లైనింగ్‌తో పాటు రక్షణ గోడ నిర్మిస్తున్నారు. ఈ పనులు పూర్తయ్యాక కాలువలో పూడికతీత పనులు చేపడతామని జేఈ శ్యామ్‌కుమార్ తెలిపారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా 45 యూనిట్లు మంజూరు

మాడుగుల రూరల్ : జిల్లా వెనుకబడిన తరగతుల ఆర్థిక సంస్థ ద్వారా మండలానికి చెందిన వెనుకబడిన తరగతుల వారికి 2024-25 ఆర్థిక సంవత్సరంలో సబ్సిడీతో కూడిన రుణ సౌకర్యం కల్పించడం కోసం 45 యూనిట్లు మంజూరు అయినట్లు ఎంపీడీవో కె.అప్పారావు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాంకు అంగీకారంతో ఓబియమ్‌యమ్‌యస్ వెబ్‌సైట్ లో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివిధ కార్పొరేషన్ల నుంచి మరో 9 యూనిట్లు మంజూరు అయ్యాయన్నారు. ఈబీసీ కార్పొరేషన్‌కు 2, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు 2, కమ్మ కార్పొరేషన్‌కు 1, క్షత్రియ కార్పొరేషన్‌కు 1, రెడ్డి కార్పొరేషన్‌కు 2, వైశ్య కార్పొరేషన్‌కు 1 చొప్పున మంజూరైనట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా వెంకన్న కల్యాణోత్సవాలు

రోలుగుంట : మండలంలో పలు గ్రామాల్లో ఏకదశి పర్వదినం సందర్భంగా సోమవారం వేంకటేశ్వర స్వామి ఆలయాలల్లో కల్యాణోత్సవాలు నిర్వహించారు. ఈ కల్యాణోత్సవాలు రోలుగుంట, కోమరవోలు, కుశర్లపూడి, తదితర గ్రామాల్లో నిర్వహించారు. రోలుగుంట వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముత్యాలు వారు కుటుంబీకులు కల్యాణం నిర్వహించడంతో పాటు, అన్నసమారాధన నిర్వహించారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయండి



కె.కోటపాడు హైస్కూల్లో టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో ప్రసాద్

కె.కోటపాడు : పది పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని మండల విద్యాశాఖాధికారి డీవీడీ ప్రసాద్ తెలిపారు. కె.కోటపాడు హైస్కూల్లో పది విద్యార్థులతో సోమవారం ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకూ జరిగిన తరగతులను విద్యార్థులు ఈ పరీక్ష కాలంలో రివిజన్‌ను చేసుకోవాలని తెలిపారు. సులభంగా పరీక్షల్లో మార్కులు వచ్చే మేప్ పాయింటింగ్, ఒక మార్కు ప్రశ్నలకు జావాబులను తప్పులు లేకుండా చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఉపాధ్యాయులు మల్లాది కామేశ్వరరావు, బోకం ఎర్రునాయుడు పాల్గొన్నారు.

సావిత్రి బాయి పూలేకు ఘన నివాళులు



అంబేడ్కర్ కాలనీలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ పెంటమ్మ

దేవరాపల్లి : దేశంలో మహిళా విద్యకు అంకురార్పణ చేసిన మహనీయురాలు సావిత్రి బాయి పూలేనని సర్పంచ్ సబ్బువరపు పెంటమ్మ అన్నారు. స్థానిక అంబేడ్కర్ కాలనీలో అంబేడ్కర్ ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం సావిత్రి బాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ పెంటమ్మ, అంబేడ్కర్ ఆశయ సాధన సమితి మండల అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు ఇతర సభ్యులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. దేశంలో మహిళల కోసం మొట్ట మొదటి పాఠశాలను ప్రారంభించి, దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా పూలే నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ఆశయ సాధన సమితి ప్రతినిధులు పతివాడ నాగభూషణం, సబ్బవరపు మాలిబాబు, కంచిమాల అప్పారావు, తాడి ఎర్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

12న జరిగే యువత పోరును విజయవంతం చేయాలి



వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు

దేవరాపల్లి : విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ఈ నెల 12న నిర్వహించే 'యువత పోరు'ను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు కోరారు. మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరు కావాలని ఆయన కోరారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి పథకాన్ని అమలు చేయాలని కోరుతూ విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి మండల వ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు అనకాపల్లి రింగ్ రోడ్డు లోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్దకు బుధవారం ఉదయం 10 గంటలకు చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

మహిళా లెక్చరర్లకు సన్మానం



మహిళా ఉపన్యాసికులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ శాస్త్రి తదితరులు

మాడుగుల : స్థానిక డిగ్రీ కళాశాలలో సోమవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపన్యాసకులు జయలక్ష్మి, షర్మిలా శ్రీ, అకడమిక్ బృంద సభ్యులు, నక్కపల్లి గణిత ఉపన్యాసకులు త్రివేణిలను ప్రిన్సిపాల్ శాస్త్రితో పాటు ఇతర ఉపన్యాసకులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి. జయలక్ష్మి మాట్లాడారు. సమాజంలో లింగ వివక్ష నేటికీ కొనసాగుతోందన్నారు. మహిళల రక్షణ కోసం ఇంకా పటిష్టమైన చట్టాలు రావలసి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపన్యాసకులు పులపర్తి పైడిరాజు, బి.రాజు, బి.నారాయణ, వి. అప్పలనాయుడు, రామ్‌కుమార్, బోధనేతర సిబ్బంది, సులేమాన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు వైస్‌ప్రిన్సిపాల్ జయలక్ష్మి లంచ్‌బాక్స్‌లు ఉచితంగా అందజేశారు.

నేడు మాడుగులలో ఉచిత వైద్యశిబిరం

మాడుగుల : స్థానిక పాలకేంద్రం వద్ద ఉచిత వైద్యశిబిరం మంగళవారం ఉదయం 10 గంటలకు జరగనుందని భారత నిర్మాణ సేవా ట్రస్టు సభ్యులు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో బీపీ, షుగర్, వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైతే ఈసీజీ ఉచితంగా తీస్తారన్నారు. ఉచితంగా కంటి పరీక్షలు కూడా నిర్వహించి కంటి ఆపరేషన్‌లు కూడా చేయిస్తారన్నారు. విశాఖకు చెందిన ఇండస్, శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రులకు చెందిన నిపుణులైన వైద్యులు ఈ శిబిరంలో పాల్గొంటారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నవమి ఉత్సవాలకు సహకరించండి



సీతారామచంద్రస్వామి వారి ఆలయం

మాడుగుల రూరల్ : వచ్చే నెలలో జరిగే శ్రీరామ నవమి ఉత్సవ వేడుకలకు కె.జె.పురం గ్రామంలో సీతా రామచంద్ర స్వామి వారి ఆలయానికి రంగులు వేయించడానికి దాతలు సహకరించాలని స్థానిక సీతారామ చంద్ర భక్త బృందం వారు భక్తులకు విజ్ఞప్తి చేశారు. దాతలు ముందుకు వచ్చి 8008656796 నంబర్‌కు ఫోన్ పే ద్వారా విరాళాలు అందజేయవచ్చని కోరారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం



తెనుగుపూడిలో వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకుంటున్న భక్తజనం

దేవరాపల్లి : తెనుగుపూడి శారదానది తీరాన ఉన్న గోవింద మాంబ సమేత శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు తెల్లవార జాము నుంచి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అంగరంగ వైభవంగా జరిగిన స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని కనులారా తిలకించి ఆనందించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో నిర్వహించిన భారీ అన్నసమారాధన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఎలుకల మందు తిని 20 నాటుకోళ్లు మృతి



మృతి చెందిన నాటుకోళ్లు

బుచ్చెయ్యపేట : మండలంలో గల కొమళ్లపూడి గ్రామంలో 20 నాటుకోళ్లు సోమవారం మృతి చెందాయి. గ్రామానికి చెందిన గొన్నా జగన్నాథం, చెల్లయమ్మ, గండెం సత్తిబాబులకు చెందిన పందెం పుంజులు, నాటుకోళ్లు మృతి చెందాయి. గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు ఎలుకల నిర్మూలన కోసం పెట్టిన ఎలుకల మందును తిన్న నాటుకోళ్లు మృత్యువాత పడ్డాయి. ఒక్కో పందెం పుంజు నాలుగు వేల రూపాయలు చేస్తాయని సుమారు రూ. 40 వేలకుపైగా నష్టం జరిగిందని బాధితులు వాపోతున్నారు.

నేడు గంగాదేవి గావు పండగ

కె.కోటపాడు : కింతాడ శివారు జోగన్నపాలెం గ్రామంలో మంగళవారం గంగాదేవి గావు పండగను ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. గంగాదేవి మండపంలో పూజలు నిర్వహించే భక్తుల కోసం కమిటీ సభ్యులు సదుపాయాలు కల్పించారు. పండగ సందర్భంగా పందిరికి వేలాడదీసే వస్తువులను భక్తులు పొందేందుకు మంగళవారం మధ్యాహ్నం దోపిడీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వీరు తెలిపారు.